రాష్ట్రంలో ఆదర్శ పాలన



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట
- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ఆదర్శ పాలనను దేశం మొత్తం గమనిస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నాలుగేళ్లుగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తున్నారని స్పష్టం చేశారు. రాష్ట్రంలో జగనన్న పాలన వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నరసన్నపేటలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లాపై సీఎం జగన్ ప్రత్యేక దృష్టి పెట్టారని, అనేక అభివృద్ధి పనులు జిల్లాలో చేపడుతున్నారని వివరించారు. జిల్లా అభివృద్ధికి టీడీపీ చేసిందేమీ లేదన్నారు. నాలుగేళ్లలో జిల్లాకు కేటాయించిన నిధులను వివరించారు. మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్ కావడం అవసరమని, దీనికి పార్టీ కార్యకర్తలు అందరూ కష్టపడాలని పిలుపునిచ్చారు.

నరసన్నపేట వైఎస్సార్‌సీపీ కంచుకోట..

నరసన్నపేట నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోట అని, దీనిని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. మీరే నా ధైర్యం అని అన్నారు. టీడీపీవి పగటి కలలు అని అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ ఆరంగి మురళి, పార్టీ నాయకులు చింతు రామారావు, గుప్త, ధర్మాన జగన్, దుంపల భాస్కరరావు, రాజాపు అప్పన్న, కనుసు సీతారాం, లుకలాపు రవి, పాగోటి భరద్వాజ్, బి.వెంకటరావు, సదాశివుని కృష్ణ, పాట్నూరు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ..

ఈ సందర్భంగా నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జలుమూరు ఎంపీపీ వాన గోపి, నియోజకవర్గంలోని పార్టీ ప్రధాన నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరు అందిస్తాం



కాలువను పరిశీలిస్తున్న వంశధార అధికారులు, ఎంపీపీ గోపి

జలుమూరు: ఉపాధి హామీ పథకం అధికారులతో సమన్వయం చేసుకుని వంశధార ఓపెన్ హెడ్, 18 ఆర్, 10 ఆర్, 19 ఆర్, 20 ఆర్ కాలువలతోపాటు అనుబంధ కాలువల్లో పూడికలు తీసి శివారు భూములు సాగునీరు అందించనున్నామని ఎంపీపీ వాన గోపి అన్నారు. మంగళవారం ఉపాధి కార్యాలయంలో ఉపాధి, వంశధార అధికారులతో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరు అందించేందుకు కాలువల్లో ఉన్న గుర్రపుడెక్క, పిచ్చి మొక్కలు తొలగిస్తామన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సహకారంతో అవసరమైనచోట మండల పరిషత్ నిధులు వెచ్చించి రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ప్రధానంగా ఉపాధి క్షేత్ర స్థాయి, సాంకేతిక సిబ్బంది చొరవ చూపాలన్నారు. వీటితోపాటు 22 ఆర్, 13 ఆర్, 14 ఆర్ కాలువలు, అనుబంధ కాలువల పనులు కూడా చేస్తామన్నారు. వంశధార డీఈఈ బగ్గు సత్యనారాయణ, అల్లాడ సొసైటీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, మండల సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు, ఏపీఓ, ఈసీ పట్ట సోమేశ్వరరావు, ఏఈలు దాలయ్య, శ్యామ్, పరిషత్తుబాబు, సర్పంచ్‌లు బొమ్మాళి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు కోన దామోదరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీలు నిర్వహించటం జరుగుతుందని ఎంపీడీఓ ఆర్ కాశీప్రసాద్ మంగళవారం తెలిపారు. సామాజిక తనిఖీ బృందాలు మండలానికి చేరుకున్నాయన్నారు. రెండు రోజుల్లో డీఆర్పీల ఆధ్వర్యంలో తనిఖీ బృందాలు గ్రామాలకు వెళ్లి 2022-23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై ఆడిట్ నిర్వహించటంతో పాటు ఉపాధి హామీ పథకం చట్టాలపై వేతనదారులకు అవగాహన కల్పిస్తాయన్నారు. గుర్తించిన అంశాలను గ్రామ సభల్లో, మండల ప్రజా వేదికలో చదివి వినిపిస్తాయన్నారు. గ్రామాలకు వచ్చే తనిఖీ బృందాలకు వేతనదారులు సహకరించాలని కోరారు.

ఈదురుగాలులు


ఈదురుగాలులు వీస్తున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడి, ఉక్కపోతతో ప్రజలు అల్లాడి పోయారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు ప్రారంభమయ్యాయి. చిరు జల్లులు కురిశాయి. గాలులతో మామిడి రైతుకు నష్టం జరిగింది.

బొడ్డేపల్లి సేవలు శ్లాఘనీయం


బొడ్డేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోపి, తదితరులు

జలుమూరు: మాజీ ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు మన జిల్లాకు చేసిన సేవలు శ్లాఘనీయమని ఎంపీపీ వాన గోపి అన్నారు. మంగళవారం ఉపాధి కార్యాలయంలో ఆయన శత జయంతి ఉత్సవాలు సందర్భంగా నివాళులర్పించారు. అల్లాడ సొసైటీ అధ్యక్షుడు శ్యామలరావు, సచివాలయ కన్వీనర్ ధర్మాన జగన్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దామ మన్మధరావు, వంశధార డీఈఈ బి.సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

అప్రమత్తతే ఔషధం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- ముందు జాగ్రత్తలతో పాడి సంపద సంరక్షణ
- వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచిస్తున్న వైద్యులు


చెట్ల నీడలో సేద తీరుతున్న పశువులు

సారవకోట: వర్షాకాలం వస్తుందంటే అందరికీ భయమే. మూగజీవాలకు సీజనల్ వ్యాధుల ముప్పు అధికం. తొలకరి ప్రారంభమైతే పశు పోషకుల్లో ఎక్కడా లేని భయం పట్టి పీడిస్తుంది. దీనికి ప్రధాన కారణం సీజనల్ వ్యాధులతో పశువులు మత్యువాత పడుతుండటమే. సీజనల్ వ్యాధులపై ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా పాడి సంపదను కోల్పోకతప్పదు. సకాలంలో వ్యాధి లక్షణాలు గుర్తించి పశు వైద్యులను సంప్రదించడం ద్వారా వాటిని సంరక్షించుకోవచ్చు.

జూన్, జూలై నెలల్లోనే అధికం

పశువులకు జూన్, జూలైల్లో వ్యాధులు అధికంగా వస్తుంటాయని పశు సంవర్ధక శాఖ అంచనా. దీంట్లో ముఖ్యంగా గొంతువాపు వ్యాధి (హెచ్ఎస్) ప్రబలిన పశువులకు గొంతుపై భాగం, మెడ కింద భాగంలో వాచినట్లు ఉంటుంది. గురక వచ్చి శ్వాస పీల్చడంలో ఇబ్బందులు ఎదురై మృతి చెందే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి నివారణకు ఆవు, గేదెలకు యాంటీబయాటిక్ ఇంజక్షన్లు వేయించాలి. జబ్బవాపు వ్యాధి (బీ క్యూ) ప్రబలిన పశువుల్లో తొడ కండరాలపై వాపుతోపాటు జ్వరం ఉంటుంది. ఇవేకాక ఈ సీజన్లో గొర్రెలు, మేకల్లో గాలికుంటు వ్యాధి (ఎఫ్ఎండీ) నీలి నాలుక వ్యాధి వంటివి సంక్రమించే ప్రమాదం ఉంది. పశు వ్యాధులలో 50 శాతం వ్యాధులు జూన్, జూలై మాసాలలో సంక్రమిస్తున్నట్లు పశు వైద్యులు చెబుతున్నారు.

పశువులు, మూగజీవాల వివరాలు ఇలా..

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు	మేకలు
సారవకోట	10546	505	15017	7591
పోలాకి	13522	312	18500	9510
నరసన్నపేట	15276	1186	9985	3446
జలుమూరు	13335	460	19646	9748
పాతపట్నం	14102	1021	9624	8916
కొత్తూరు	12216	844	18909	5823
మెళియాపుట్టి	10985	914	10369	14977
హిరమండలం	11564	765	5477	4252

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వర్షాకాలంలో పశువులు, మేకలు, గొర్రెలను పాకల్లోనే ఉంచాలి.
- బురద, చిత్తడి నేలల్లో తిరగకుండా చూడాలి.
- పరిశుభ్రమైన నీరు తాగించాలి, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి.
- లేగ దూడలను వ్యాధి ప్రబలిన పశువులకు దూరంగా ఉంచాలి. మేత, దాణా తగు మోతాదులో ఇవ్వాలి.
- ఎలాంటి వ్యాధి లక్షణాలున్నా వెంటనే సంబంధిత పశు వైద్యాధికాను సంప్రదించి నివారణకు తగు చర్యలు తీసుకోవాలి.
- ముందు జాగ్రత్తగా పశువులకు యాంటీబయాటిక్ టీకాలు వేయించాలి.

టీకాలు వేయించాలి



గ్రామ సచివాలయాల్లో ఉన్న రాజన్న పశువైద్య కేంద్రాల ద్వారా ప్రతీచోట పశువులకు వ్యాక్సిన్లు వేయిస్తున్నాం. ప్రస్తుతం అన్నిచోట్లకు వ్యాక్సిన్లు అందజేశారు. వాటిని పశువులకు వేయించి వ్యాధుల నుంచి రక్షించుకోవాలి.

– వి.జయరాజ్, పశుసంవర్ధక శాఖ డీడీ, టెక్కలి డివిజన్

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం


గ్రామ వలంటీర్లను సన్మానిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలో గల ఎస్ఎస్ఎన్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందన కార్యక్రమంలో భాగంగా సేవా పురస్కారాలకు ఎంపికైన గ్రామ వలంటీర్లను మంగళవారం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఇంటికి చేరవేయడంతోపాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. ప్రజలకు పారదర్శక పాలన అందించడంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, గ్రామ వలంటీర్ వ్యవస్థలు కీలకమన్నారు. ప్రజలకు సేవలు అందించే వలంటీర్లకు ఎప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. వలంటీర్ వ్యవస్థను దేశంలోని ఇతర రాష్ట్రాలు కొనియాడుతున్నాయన్నారు. దేశం గర్వించదగ్గ పరిపాలన సీఎం జగన్ అందజేస్తున్నారని, రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని కోరారు. నవరత్నాల పేరుతో 43 సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. మహాత్మగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవినాగ్, మండల ప్రత్యేకాహ్వానితుడు తమ్మినేని శ్రీరామూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కో ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్, తొగరాం సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు

- వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్



మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

ఆమదాలవలస: ఇటీవల మహానాడులో చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో వట్టి బూటకమని, ఆ హామీలను ప్రజలు నమ్మరని వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్ అన్నారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2014లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో కనీసం 25 శాతం కూడా నేరవేర్చలేదని, అందుకు ప్రజలు తిరగబడతారని భయపడి టీడీపీ వెబ్ సైట్ నుంచి మేనిఫేస్టోను తీసేశారన్నారు. అలాంటి మోసగాడైన చంద్రబాబును ప్రజలు మళ్లీ ఎలా నమ్ముతారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గౌరవించి, మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి బాధ్యతగా అమలు పరిచిన వ్యక్తి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్న వ్యక్తి సీఎం జగనన్న అని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తెరగాలన్నారు. 2019లో జగనన్న మేనిఫెస్టోని, 2014 చంద్రబాబు మేనిఫెస్టోను పట్టుకొని వాటి అమలు గురించి చర్చించే దమ్ము ఏ తెలుగుదేశం నాయకునికైనా ఉందా అని రవికుమార్ సవాల్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు చిగురుపల్లి రవికుమార్, ముద్దాడ ఈశ్వరరావు, కొప్పల ఈశ్వరరావు, అన్నెపు కృష్ణ, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

పేరుకుపోయిన గుర్రపుడెక్క


గుర్రపుడెక్కతో నిండి ఉన్న పెద్దచెరువు

సరుబుజ్జిలి: మినీ రిజర్వాయర్‌గా పిలవబడుతున్న కొత్తకోట పెద్దచెరువు పూర్తిగా గుర్రపుడెక్కతో నిండిపోయింది. ఏళ్ల తరబడి చెరువులో పూడిక తీయకపోవడంతో చెరువు గర్భం మైదానాన్ని తలపిస్తుంది. ఈ చెరువు కింద సుమారు 4 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. అవసరమైన సమయంలో సాగు నీటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పింద్రువాడ


ట్రోఫీతో క్రికెట్ విజేతలు

హిరమండలం: మండలంలోని రెల్లివలస గ్రామంలో బరాటం వెంకట రమణయ్య జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో పింద్రువాడ జట్టు విజేతగా నిలిచింది. నాలుగు మండలాల నుంచి 32 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఫైనల్స్‌లో పాత హిరమండలంపై పింద్రువాడ జట్టు విజేతగా నిలిచింది. బరాటం వెంకట రమణయ్య కుమారులు, ఎంపీటీసీ, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, రెల్లివలస యువత పాల్గొన్నారు.

ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్‌గా ధర్మపురం యువకుడు



పొందూరు: మండలంలోని .దర్మపురం గ్రామానికి చెందిన చింతాడ వరుణ్‌కుమార్ ఆదాయపన్నుల శాఖ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. ఇటీవల విడుదలైన స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ ఫలితాల్లో 390 మార్కులకు 328 మార్కులు సాధించి కేంద్ర ఆర్థికశాఖ పరిధిలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ టాక్స్ విభాగంలో ఇన్‌కం టాక్స్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులైనట్లు అధికారికంగా ఉత్తర్వులు విడుదల య్యాయి. ఉత్తర్వులను వరుణ్‌కుమార్ అందుకున్నారు. వరుణ్ కర్నాటకలోని నిట్‌లో ఎంటెక్ పూర్తి చేశాడు. తండ్రి చింతాడ తవిటినాయుడు విశ్రాంత ఉపాధ్యాయుడు, తల్లి గృహిణి. వరుణ్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలపోలమ్మతల్లికి చల్లదనం


ఆకట్టుకున్న వేషధారణలు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామదేవత ముత్యాలపోలమ్మతల్లికి గ్రామ ప్రజలు చల్లదనం చేశారు. మంగళవారం వారాలు చేసి గ్రామదేవతకు ముర్రాటలతో మొక్కులు చెల్లించుకున్నారు. పలువేషధారణలతో గ్రామంలో తిరుగుతూ గ్రామదేవత ప్రతిమను పురవీధుల్లో ఊరేగించారు. కర్రసాముతో పాటుగా పలు సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. గ్రామ ప్రజలు సంతోషంగా ఉండాని, పంటలు సక్రమంగా పండాలని కోరుకున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

ముగిసిన గ్రామదేవత ఉత్సవాలు


ఘటాలతో అమ్మవారి ఆలయానికి వెళ్తున్న మహిళలు

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు గ్రామంలో మూడు రోజుల నుంచి జరుగుతున్న గ్రామ దేవత ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. గ్రామ దేవత, నీలమణి అమ్మవార్ల పండగులు ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గ్రామంలోని మహిళలంతా ఘటాలతో ఆలయాలకు వెళ్లి ప్రత్యేక, విశేష పూజలు చేపట్టారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

సరుబుజ్జిలి: మండలంలోని పెద్దసవళాపురం ఇసుక ర్యాంపు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం అర్ధ రాత్రి తరువాత ఎస్ఈబీ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు ఎస్ఈబీ అధికారులు మంగళవారం వెల్లడించారు. ఇసుక ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కూటికుప్పల కృష్ణప్రసాద్ తెలిపారు.

ట్రాఫిక్ జామ్


నిలిచిపోయిన వాహనాలు

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి పెద్దపండుగ ముగింపు సందర్భంగా మంగళవారం ఉదయం అమ్మవారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ జామ్ అయింది. సెయింటాన్స్ స్కూల్, ఎస్‌బీఐ నుంచి ట్రాఫిక్ నిలిచింది. దీంతో ప్రజలు, భక్తులు ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి నాలుగు చక్రవాహనాలు, ఆటోలను పాతపట్నంలోకి పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ద్విచక్ర వాహనాలతో పాతపట్నంలోకి రావడంతో ట్రాఫిక్ జామ్ అయింది.

ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు


మాట్లాడుతున్న సర్పంచ్ వేణుకుమారి

పాతపట్నం: పాతపట్నంలోని పెద్దపండగకు ఈ నెల 21 నుంచి 30వ తేదీ వరకు) సహకరించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి, పాతపట్నం ప్రజలు, ఉత్సవ హెడ్ కమిటీ సభ్యులు, పోలీస్, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు, శానిటేషన్ సిబ్బందికి పాతపట్నం మేజర్ పంచాయతీ సర్పంచ్ శిర్ల వేణుకుమారి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం పాతపట్నంలో విలేకరులతో మాట్లాడారు. సీసీ రహదారులు, బ్లీచింగ్, సున్నం, రహదారులకు గ్రావెల్, పారిశుద్ధ్యం కోసం రూ.40 లక్షలు ఖర్చు చేశామన్నారు. ప్రత్యేకంగా శానిటేషన్ కోసం టెక్కలి, కోటబొమ్మాళి, హిరమండలం పంచాయతీల నుంచి పారిశుద్ధ్య కార్మికులను తీసుకువచ్చామన్నారు. ఈఓ కూర్మారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు జోగారావు పాల్గొన్నారు.